క్లుప్తంగా

నేడు మంత్రి కాకాణి రాక

పొదలకూరు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఉదయం 10.30 గంటలకు పొదలకూరు రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొంటారని తహసీల్దార్ వీరవసంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించడంతోపాటు, రెవెన్యూ సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. కార్యాలయంలో మధ్యాహ్నం 12.30 గంటలకు మంత్రి ఉంటారని తెలియజేశారు.

నగదు ప్రోత్సాహకాల ప్రదానం

నెల్లూరు(బృందావనం): నరుకూరు రోడ్డులోని మద్దులూరు వీర రాఘవయ్య కల్యాణ మండపంలో నెల్లూరు జిల్లా నాయీ బ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 40 మంది విద్యార్థులకు రూ.రెండు వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఇద్దరు విద్యార్థులకు రూ.3,500 చొప్పున రవికుమార్, విజయలక్ష్మి దంపతులు పంపిణీ చేశారు. వేలూరు రంగారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పారిశ్రామికవేత్త దువ్వూరు కిషోర్‌బాబు, దీపిక బాబా, విశ్రాంత జేసీ ఒంగోలు శేషయ్య, జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజర్ కూరపాటి పెంచలసుధాకర్, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అమరావతి, పొట్లూరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత, నృత్య పోటీలు

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో సంగీత, నృత్య పోటీలను ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేతా సుబ్బారావు పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరవ రాయప్ప, నజీర్‌బాషా, సంఘసేవకుడు అంజద్‌బాషా, తదితరులను సత్కరించారు. వర్ధమాన కళాకారులు.. సంగీత, నృత్య పోటీల్లో పాల్గొన్న బాలలకు నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలను అందజేశారు. బాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాయకులు లక్ష్మి, మధుసూదన్, షఫీ, రామచంద్రరావు, తదితరులు ఆలపించిన గీతాలు అలరించాయి. కార్యక్రమంలో మెట్టు రామచంద్రప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

13న యాదే రఫీ

నెల్లూరు(మినీబైపాస్): పద్మశ్రీ మహమ్మద్ రఫీ 43వ వర్ధంతిని పురస్కరించుకొని యాదే రఫీ కార్యక్రమాన్ని ఈ నెల 13న నిర్వహించనున్నామని రఫీ కల్చరల్ అకాడమీ ప్రెసిడెంట్ జావీద్ అహ్మద్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా టౌన్‌హాల్లో మ్యూజికల్ నైట్‌ను నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన గాండ్ల సామాజికవర్గానికి చెందిన విద్యార్థులకు పురస్కారాలను అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. నగరంలోని మహేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో 16 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గ్రోను సుబ్బారావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రావు, హరగోపాల్, శేషయ్య, గుర్నాథం, ధనుంజయ, సురేష్ బాబు, శ్రీనివాస్, రమేష్‌బాబు, చంద్రబాబు, ఆదిశంకర కళాశాల ప్రిన్సిపల్ వేణు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌కు ఫ్యాన్ల వితరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బట్వాడిపాళెంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. వసతి గృహ విద్యార్థినుల సౌకర్యార్థం రూ.30 వేల విలువైన సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. తన స్నేహితుల సహకారంలో హాస్టల్లో పలు సమస్యలను పరిష్కరించామని తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): పట్నా ఎక్స్‌ప్రెస్ కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వేదాయపాళెం – నెల్లూరు రైల్వేస్టేషన్ మధ్యలో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 65 నుంచి 70 ఏళ్లలోపు వయస్సు కలిగి.. తెలుపు రంగుపై గ్రే రంగు నిలువు గీతల హాఫ్ హ్యాండ్స్ చొక్కా, బ్రౌన్ రంగుపై తెలుపు రంగు చెక్స్ లుంగీని ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె కోరారు.

వచ్చే ఎన్నికల్లోనూ విజయం ఖాయం

- ముత్తుకూరులో బహిరంగ సభ విజయవంతం
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం


కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన యువత

ముత్తుకూరు: 'వచ్చే ఎన్నికల్లోనూ సర్వేపల్లిలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఘన విజయం సాధించడం ఖాయం.' అని ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. ముత్తుకూరులో ఆదివారం రాత్రి భారీగా యువత చేరిక పేరుతో నిర్వహించిన బహిరంగ సభ వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. మండలం నలుమూలల నుంచి హాజరైన నాయకులు, కార్యకర్తలతో సభా వేదిక కిక్కిరిసిపోయింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీల నుంచి సుమారు 500 మంది యువకులు పార్టీలో చేరడం అదనపు బలాన్ని చేకూర్చింది. సభకు ముందు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నుంచి మార్కెట్ కూడలి వరకు పెద్ద ఎత్తున ర్యాలీ జరిగింది. ఇందులో యువత ఉత్సాహంగా పాల్గొంది. పెద్ద ఎత్తున టపాసులు కాలుస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి గోవర్ధన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో, వినయ్, వాసుల పర్యవేక్షణలో యువకులు పెద్ద సంఖ్యలో పార్టీ చేరడం విశేషం.


మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు


ముత్తుకూరులో భారీ ర్యాలీ

కాకాణి ప్రసంగం

సభలో మంత్రి కాకాణి ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌ల యాత్రలు, వారి ప్రసంగాలపై విమర్శలు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత చేస్తున్న విమర్శలను తనదైన శైలిలో తిప్పికొట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను విపులంగా చర్చించడం ఆసక్తి కలిగించింది. సర్వేపల్లి నియోజకవర్గంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరును కాకాణి ఎండగట్టారు. సోమిరెడ్డి వ్యవహార శైలిపై చురకలు వేయడం ద్వారా సభికుల కరతాళధ్వనులు అందుకున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు కూడా రావని, వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడుతుందంటూ చేసిన ప్రకటన కార్యకర్తలను ఉత్తేజపరిచింది. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని చెప్పడం ద్వారా పార్టీ బలాన్ని, ప్రజల ఆదరణను చాటిచెప్పారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


మాట్లాడుతున్న సీఐ సంగమేశ్వరరావు

మనుబోలు: మండల కేంద్రంలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, దీనిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని పొదలకూరు సీఐ సంగమేశ్వరరావు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బహిరంగ ప్రదేశాలు, రద్దీగా ఉండే కూడళ్లలో ధర్నాలు, ఊరేగింపులు ర్యాలీలు నిర్వహించరాదన్నారు. అలాగే దిష్టిబొమ్మలు దహనం చేయడం, బహిరంగ సభలు నిర్వహించడం చేయరాదన్నారు. 30 యాక్ట్‌ను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై అజయ్‌కుమార్ ఉన్నారు.

అధికారులు చొరవ తీసుకోవాలని వినతి


మాట్లాడుతున్న దళిత బహుజన సేవా సంఘం నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ఉన్న అంబేడ్కర్ భవనం అభివృద్ధికి సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని దళిత బహుజన సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బాబురావు కోరారు. బుచ్చిరెడ్డిపాళెంలోని అంబేడ్కర్ భవనం వద్ద ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరుకుని పెచ్చులు ఊడుతున్నాయన్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు పట్టించుకోవడం లేదన్నారు. శనివారం రాత్రి భవనం బయట భాగంలో ఉన్న శ్లాబు పూర్తిగా పడిపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి భవనం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరామ్, వెంకటస్వామి, అంకులయ్య, రమణయ్య, చెన్నయ్య, మాల్యాద్రి పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ పరిధిలో ఉన్న పల్లాప్రోలు ఎస్సీ కాలనీలో ఇటీవల డయేరియాతో ఈదూరు లక్ష్మీకాంతమ్మ అనే మహిళ మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె వైఎస్సార్ బీమాలో సభ్యురాలిగా ఉండడంతో తక్షణ సహాయం కింద కుటుంబ సభ్యులకు ఆదివారం రూ.10 వేలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరు మధుసూదన్‌రెడ్డి, ఆదిశేషయ్య, కిరణ్, కార్యదర్శి కావేరి పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని బీసీ బాలుర వసతిగృహంలో ఉంటున్న సుమారు 100 మంది విద్యార్థులకు సహారా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సివిల్ సప్లైస్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట సుధాకర్ మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డుకా కూడదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. అలాగే సహారా ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు యస్దానీబాషా పేద విద్యార్థులకు తన వంతు సహాయం చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించిన పుచ్చలపల్లి సతీష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వసతి గృహం వార్డెన్ రమణయ్య పాల్గొన్నారు.

మురళీకృష్ణకు జోతిష్య వైభవ కేసరి పురస్కారం


మురళీకృష్ణకు పురస్కారం అందజేస్తున్న సినీ నటుడు ప్రదీప్ తదితరులు

ముత్తుకూరు: మండల కేంద్రమైన ముత్తుకూరుకు చెందిన జోతిష్య శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ ఆదివారం 'జోతిష్య వైభవ కేసరి' పురస్కారం అందుకున్నారు. జోతిష్యం, వాస్తు, నాట్యం తదితర రంగాల్లో కృషి చేస్తున్న 9 రాష్ట్రాల ప్రముఖులు 135 మందిని స్వాతంత్య్ర దినోత్సవ సంబరాల్లో భాగంగా హైదరాబాద్ లలిత కళా సమాఖ్య ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణకు స్వర్ణ కంకణంతో పాటు జోతిష్య వైభవ కేసరి పురస్కారాన్ని సినీ నటుడు ప్రదీప్ చేతుల మీదుగా ప్రదానం చేశారు.

కోడూరు తీరంలో పర్యాటకుల సందడి



తోటపల్లిగూడూరు: కోడూరు బీచ్‌కు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి అనేక కుటుంబాలు విచ్చేసి సందడిగా గడిపాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పర్యాటకుల రాక సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగింది.

విస్తృత ప్రచారం



కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఆ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు డి.సుర మౌళి, సభ్యులు సుమలత, నాగేశ్వరరావు, డీవీ ప్రసాద్, కృష్ణ, అన్నపూర్ణ, వెంకయ్య, లక్ష్మి, సుందరరాజా తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న టెంపో

- ఒకరి మృతి


బోల్తా పడిన టెంపో

వెంకటాచలం: టిప్పర్‌ను టెంపో ఢీకొని బోల్తా పడి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరు చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ ఘటన మండల కేంద్రమైన వెంకటాచలంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కావలిలోని స్టేట్ బ్యాంక్‌లో పనిచేస్తున్న తొమ్మిది మంది ఉద్యోగులు తిరుపతిలో శిక్షణ కోసం టెంపోలో వెళ్లారు. తిరిగి కావలికి వెళ్తుండగా వెంకటాచలం సమీపంలో జాతీయ రహదారిపై టిప్పర్‌ను టెంపో ఢీకొనడంతో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు ఉద్యోగులకు తీవ్ర గాయాలవగా, మరో ఐదుగురికి, టెంపో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వెంటనే హైవే అంబులెన్స్‌లో నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ నలుగురిలో రాజ్‌కుమార్ (30) అనే వ్యక్తి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు షూటింగ్‌బాల్ జూనియర్ జట్ల ఎంపిక

బుచ్చిరెడ్డిపాళెం: కోవూరులోని పాటూరు ఉన్నత పాఠశాలలో సోమవారం షూటింగ్‌బాల్ జిల్లా జూనియర్ బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భీమతాటి వెంకటరమణయ్య తెలిపారు. ఆదివారం ఆయన బుచ్చిరెడ్డిపాళెంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఎంపికల్లో పాల్గొనేందుకు జనవరి 1వ తేదీ 2004 సంవత్సరం తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. ఎంపికలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరుగుతాయన్నారు. ఆయా జట్లు ఈ నెల 12, 13 తేదీల్లో బుచ్చిరెడ్డిపాళెంలో జరిగే అంతర్‌జిల్లాల షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. వివరాలకు 949032 0435, 79890 49566 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చర్యలకు డిమాండ్

ఇందుకూరుపేట: దాడిలో గాయపడి ఇందుకూరుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న యాటగిరి రమణమ్మను కిడ్నాప్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఆస్పత్రి వద్ద విలేకరులతో మాట్లాడారు. గిరిజన మహిళపై దారుణంగా దాడిచేసి, గదిలో బంధించి, కులంపేరుతో దూషించిన టీడీపీ నేత గంపల అనిల్‌పై చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, ఏందోటి సురేంద్ర, ఏలూరు బుజ్జయ్య పాల్గొన్నారు.

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ గడువు పొడిగింపు

కొడవలూరు: పీఎం కిసాన్‌కు అర్హులైన రైతులు ఈ కేవైసీ చేయించుకునేందుకు ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించినట్లు ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 89 శాతం మంది రైతులు మాత్రమే ఈకేవైసీ చేయించుకోవడం జరిగిందన్నారు. గడువు పొడిగించినందున మిగిలిన రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న శ్రీకాంత్ అనే విద్యార్థి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరు మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబానికి చెందిన శ్రీకాంత్‌ను ఆదుకోవాలని పాఠశాల హెచ్ఎం సీహెచ్ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి రూ.52 వేలు సిద్ధం చేశారు. ఆదివారం ఆస్పత్రికి వెళ్లి విద్యార్థి తండ్రికి నగదు అందజేశారు. శ్రీకాంత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ విజయ్‌విశ్వేశ్వరన్, ఉపాధ్యాయులు రామ్మూర్తి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా మొగళ్లూరు రోడ్డు నిర్మాణం

- రూ.1.13 కోట్లతో పనులు


పనులు జరుగుతున్న దృశ్యం

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామానికి సిమెంట్‌రోడ్డు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న మొగళ్లూరు బ్రాంచి రోడ్డుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రూ.1.13 కోట్ల నిధులను మంజూరు చేయించారు. శాశ్వత ప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులు చేయిస్తున్నారు. గతంలో తారురోడ్డుకు ఎన్నిపర్యాయాలు మరమ్మతులు చేసినా గుంతలు పడుతూ రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రహదారిపై ఊసపల్లి, వావింటపర్తి, అంకుపల్లి, పులికల్లు, వెంకటాపురం, పర్వతాపురం గ్రామాల ప్రజలు ప్రతినిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఫలితంగా రోడ్డు సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రజల సమస్యలను గుర్తించిన మంత్రి సిమెంట్‌రోడ్డు అయితే చాలాకాలం ఉంటుందని అధికారులతో మాట్లాడి అంచనాలు వేయించి నిధులు మంజూరు చేయించారు. ఫలితంగా పనులు వేగంగా చేపట్టి మరో వారంరోజుల్లో పూర్తి చేయనున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

మనుబోలు: మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1990–91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు ఎస్.గోపాలన్, మ్యాథ్స్ టీచర్ మల్లికార్జునరావు, తెలుగు, సోషల్, డ్రాయింగ్, క్రాఫ్ట్, పీఈటీ ఉపాధ్యాయులు రామానుజన్, కోటేశ్వర్రావు, భాస్కర్‌రెడ్డి, అజయ్‌కుమార్, మాలకొండయ్య, సుందరయ్యకు పాదపూజ చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు మస్తాన్‌కుమార్, ధనంజయరెడ్డి పర్యవేక్షించారు.

గొలగమూడిలో స్నేహితుల దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న బాలభవన్ డైరెక్టర్, విద్యార్థినులు

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి వద్దనున్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి పాల్గొని స్నేహితుల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థినుల చేత ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కొండల్‌రావు, ప్రముఖ కవి పెంచల నరసింహం తదితరులు పాల్గొన్నారు.

నార్తురాజుపాళెంలో శాంతి ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొడవలూరు: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను అరికట్టాలని క్రైస్తవ ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని నార్తురాజుపాళెంలో మండల క్రైస్తవ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని మణిపూర్‌లో దాడులు జరగకుండా చూడాలన్నారు. సుప్రీంకోర్టు హెచ్చరించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన రీతిలో స్పందించకపోవడం విచారకరమన్నారు. అనంతరం నార్తురాజుపాళెం కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాస్టర్‌లు డాక్టర్ ఎం.ప్రేమ్‌నాథ్, సాల్మన్‌రాజ్, ఎస్.ఆనందరావు, జాషువా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్ట పంటల సాగుకు అనుకూలం


సాగుకు సిద్ధం చేసిన పొలం

పొదలకూరు: మండలంలో మెట్ట పంటల సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. వర్షాలు కురుస్తుండడంతో రైతులు సమాయత్తం అవుతున్నారు. ఈ ప్రాంతంలో విస్తారంగా మినుము సాగు చేపట్టే రైతులు కొంతకాలంగా విస్తీర్ణాన్ని బాగా తగ్గించారు. మెట్టపంటల సాగుకు ముందుగానే దుక్కిదున్నకం పనులు పూర్తి చేసుకునే యోచనలో ఉన్నారు. వర్షం కురిస్తే వెంటనే స్వల్ప విస్తీర్ణంలో పప్పుధాన్యాల సాగు చేసేందుకునేందుకు ఆర్బీకేల ద్వారా విత్తనాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఏడాది పెసర, కంది, పచ్చిశెనగ, జొన్న పంటల సాగు చేసే అవకాశం ఉంది. మండలంలో తృణధాన్యాల సాగును వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతులకు విత్తనాల కిట్లను ఉచితంగా ఆర్బీకేల ద్వారా అందజేస్తోంది. తృణధాన్యాలు ఆరోగ్యానికి మంచిది కావడం వల్ల పట్టణ ప్రాంతాల్లో వాటికి డిమాండ్ బాగా ఉంది. కొర్రలు, రాగులు, అరికెలు, సాములు, ఉదలు, వరిగలు, సజ్జలు, జొన్నలు అందుబాటులో ఉన్నాయి.